వీఎంఆర్డీఏ ఎంసీగా తేజ్ భరత్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ గా ఇటీవల ప్రభుత్వం నూతనంగా నియమించిన ఎన్.తేజ్ భరత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాధిపతులు ఆయనను కలిసి, పుష్పగుచ్చాలతో అభినందించారు. అనంతరం వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్‌ని మర్యాద పూర్వకముగా కలిసారు. ఈ సందర్భంగా సంస్థ ప్రస్తుతం చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు.

గ్లోబల్ బ్రాండ్‌గా అరకు కాఫీ

- ఆక్వా, ప్రకృతి సాగులో ఏపీ అగ్రస్థానం
- పరిశ్రమలకు 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సిద్ధం
- సీఐఐ భాగస్వామ్య సదస్సు తొలి ప్లీనరీలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, భాగస్వామ్యాలే అభివృద్ధికి మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సీఐఐ భాగస్వామ్య సదస్సును కేవలం పెట్టుబడుల కోసం మాత్రమే చూడొద్దని నెట్వర్కింగ్ కోసం, మేధోపరమైన చర్చల కోసం, ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేశామని అన్నారు. 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ ప్లీనరీ సదస్సులో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. సౌదీ, రష్యా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, శ్రీలంక, జపాన్, కెనడా తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కావటం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పరస్పరం పెట్టుబడుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధించగలమనే విషయాన్ని గుర్తించాలని సీఎం కోరారు. సింగపూర్ చాలా చిన్న దేశమైనా అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చిందని తెలిపారు.

ఏపీ ప్రకృతిసాగులో అగ్రస్థానం
పర్యాటక రంగంలో పెట్టుబడులకు అనుకూలం

ఆర్గానిక్ ఉత్పత్తిగా అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగిందని, ఆక్వా ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయంలోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. 'ఖనిజాలు, రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో కొత్త టెక్నాలజీలతో పని చేసే సంస్థలతో భాగస్వాములయ్యేందుకు ఏపీ సిద్ధంగా ఉందని, ఏపీలోని సుదీర్ఘ తీరప్రాంతం, గండికోట, అరకు లాంటి ప్రకృతి అందాలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అనుకూలమైన ప్రదేశాలు ఉన్నాయని, అలాగే కొత్తగా భారతీయ రుచులకు సంబంధించిన రంగాల్లోనూ విస్తృత అవకాశాలు వినియోగించుకోవచ్చు అన్నారు. నూతన ఆవిష్కరణలు, యువతకు నైపుణ్యాల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశామని వివరించారు.

అందుబాటులో 50 వేల ఎకరాలు

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ అందుబాటులో ఉంచామని సీఎం చంద్రబాబు అన్నారు. మానవాళి సంక్షేమం కోసం అంతా కలిసి పనిచేద్దామని దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులకు, పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉందని అన్నారు. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ మళ్లీ విజయం సాధించిందని, ఎన్డీఏపై నమ్మకం ఉంచిన ప్రజలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సుకు ఆర్మేనియా, సింగపూర్, మారిషస్, నేపాల్, అంగోలా, వెనిజులా దేశాలకు చెందిన మంత్రులు యూఎన్ఓ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీ

- ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- మంత్రి నారా లోకేష్



విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు ఏపీ ఆతిథ్యం ఇస్తుండటం ఎంతో గర్వకారణంగా ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి మంత్రి లోకేష్ పేర్కొన్నారు. విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ మీ అందరికీ సుందర విశాఖపట్నంలో స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. భారతదేశం ప్రపంచ ఆర్థిక వృద్ధికి ఇంజన్ గా నిలుస్తున్న సమయంలో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ కు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇస్తుండటం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీని ఎందుకు ఎంచుకో వాలని చాలామంది నన్ను అడుగుతారనీ, అందుకు మూడు కారణాలు ఉన్నాయన్నారు. మొదటిది అనుభవం కలిగిన దార్శనికత కలిగిన నాయకత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వారసత్వాన్ని నిర్మించే అవకాశం రాజకీయ నాయకులకు జీవితంలో ఒక్కసారి మాత్రమే అవకాశం వస్తుందన్నారు. కానీ రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడు కి రెండో వారసత్వాన్ని నిర్మించే అవకాశం ఇచ్చారనీ, అదే అమరావతి, విశాఖపట్నం అన్నారు. పెట్టుబడులకు ఏపీనే ఎందుకు ఎంచుకోవాల నేందుకు రెండో కారణం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని, ప్రస్తుతం వేగవంతమైన ప్రపంచంలో మనం ఉన్నామనీ, మార్కెట్లు, నియంత్రణలు, సాంకేతికత నిరంతరం మారుతున్న ఈ వేగవంతమైన ప్రపంచంలో స్పీడ్ అనేది చాలా ముఖ్యం అన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా.. ఆంధ్రప్రదేశ్ ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిదుతామని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

అనాధ బాలలకు గీతంలో ఉచిత దంత పరీక్షలు

విశాలాంధ్ర - మధురవాడ: బాలల దినోత్సవ సందర్భంగా నగరంలోని వేపగుంట వద్దగల గ్రేషియస్ జస్ట్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అనాధ పాఠశాలల బాలలకు గీతం దంత కళాశాల,ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం దంత సంరక్షణతోపాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, దంతాల ప్రాధాన్యతపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. దంత వైద్యుల సమక్షంలో బాలల దినోత్సవ వేడుకలలను జరిపి పండ్లు, కేక్‌లను పంచారు. దంత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.నరసింహరావు మాట్లాడుతూ నగరంలోని పాఠశాలలో ఏడాది పొడవునా "శిశు గీతం" పేరిట ప్రత్యేక దంత వైద్యశిబిరాలను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల దంత వైద్య విభాగం (పెడోడాంటిక్స్) అధిపతి డాక్టర్ సి.శ్రీనివాస కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ పి.జయలక్ష్మి, డాక్టర్ బి.నళిని, డాక్టర్ పి.కోమలి, డాక్టర్ సి.హెచ్.పద్మజ, డాక్టర్ బి.శాంతి తదితరులుతో పాటు పి.జి వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల సదస్సులో కాలేజీ విద్యార్థులే...!

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: లక్షల కోట్లు పెట్టుబడి వస్తున్నాయని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల సదస్సులో అనేకమంది ఇంజనీరింగ్, సైన్స్, ఐటి కళాశాలల విద్యార్థులే హాజరయ్యారు. గీతం, దాడి, ఎంవిజిఆర్, రఘు, అనీట్స్, వంటి కళాశాల నుండి వందలాది మంది విద్యార్థులు సిఐఐ సమ్మిట్‌కు హాజరయ్యారు. పెట్టుబడిదారుల సదస్సుకు 2500 మంది ప్రతినిధులు హాజరైనట్లు చెబుతున్న ప్రభుత్వం లెక్కల్లో అనేకమంది విద్యార్థులే ఉండడం విశేషం. మరి కొంతమంది కూటమి పార్టీల నేతలు, క్రియాశీలక కార్యకర్తలు పెట్టుబడిదారుల అవతారం ఎత్తి ప్రతినిధులకు హాజరయ్యారు. విశాఖలో ప్రతి సారి జరుగుతున్న సిఐఐ సమ్మిట్‌కు వచ్చిన వ్యాపారులే ప్రతి సమ్మెటకు రావడం విశేషం. విశాఖలో వివిధ వస్త్ర దుకాణాల వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, తో పాటు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా ప్రతినిధులకు హాజరయ్యారు. ఎంఓయులు పెద్దపెద్ద కంపెనీలే చేసుకున్నప్పటికీ ప్రతినిధుల హాజరు కోసం అనేక సంస్థల నుండి ఉద్యోగులను, వివిధ కళాశాల నుండి విద్యార్థులను ఈ సదస్సులో అవకాశం కల్పించినట్లు తెలుస్తుంది. నిజంగా వచ్చిన పెట్టుబడులు గ్రౌండ్ అయి పరిశ్రమల స్థాపిస్తారా అన్న అనుమానం కూడా వచ్చిన ప్రతినిధుల్లో అనేకమంది వ్యక్తం చేశారు. కోట్లు పెట్టుబడి పెట్టి నిజంగా ఒప్పందాల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు విద్యార్థులు, పది సంవత్సరాల ఉద్యోగులు ప్రతినిధులుగా పెట్టుబడిదారులుగా రావడం ఆశ్చర్యానికి గురిచేసింది.

మాకిరెడ్డి రామానాయుడు మృతి సాహిత్య రంగానికి తీరనిలోటు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మాకిరెడ్డి రామానాయుడు మృతికి ఇస్కాప్, ప్రజానాట్యమండలి నేతలు సంయుక్తంగా నివాళులు అర్పించారు. సాహిత్య రంగానికి, అభ్యుదయ రంగానికి రామనాయుడు మరణం చాలా తీవ్ర లోటు కలిగించిందని నేతలు విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాప్ అధ్యక్షులు యస్.నరసింహులు, జిల్లా కార్యదర్శి సత్యాంజనేయులు, ప్రజానాట్యమండలి నాయకులు కాసుల రెడ్డి, ఎన్.అప్పారావు, సీపీఐ నాయకులు క్షేత్ర పాల్, లక్ష్మణరావు, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సీఐఐ సదస్సు ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సీఐఐ భాగస్వామ్య సదస్సు అట్టహాసంగా ప్రారంభమయ్యింది. సదస్సు ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పచ్చని తివాచీలు, మొక్కలతో ఆహ్లాదకరంగా కనిపించింది. సదస్సు ప్రాంగణంలో అతిథులను ఆహ్వానం పలుకుతూ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గిరిజనుల థింసా, తప్పెటి గుళ్ళు, ఉత్తరాంధ్ర జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆశించిన స్థాయిలో అతిథులు డెలిగేట్స్ వస్తారో రారో అని అనుమానంతో వివిధ కాలేజ్ నుంచి విద్యార్థులను తీసుకొచ్చి కూర్చో బెట్టారు. కాస్త ఆలస్యంగా డెలిగేట్స్, అతిథులు హాజరు కావడంతో సమావేశం వరకు నిలబడే ఉన్నారు. డెలిగేట్‌లకు కుర్చీల కొరతతో ఇబ్బంది పడ్డారు. అదనంగా కుర్చీలు వేద్దామన్న స్థలం లేని పరిస్థితి. ఆహుతులు అతిథుల ప్రసంగాలు శ్రద్ధగా విన్నారు. సదస్సులో ప్రసంగించిన లులూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీ మాట్లాడేటప్పుడు ముఖ్యమంత్రి నవ్వుతూ ఆసక్తి కనబరిచారు. లూలు మాల్ వెనక్కి వెళ్ళి మళ్ళీ వచ్చి తిరిగి శంకుస్థాపన చేసిన విషయాన్ని యూసఫ్ అలీ ప్రస్తావించారు. తిరిగి ప్రారంభమవడానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సహకారం అందించారని తెలిపారు. ఇక్కడి ప్రజలు, ముఖ్యమంత్రి చంద్రబాబు కలలకు అనుగుణంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో లులూ గ్రూప్ అత్యాధునిక మాల్స్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తోందన్నారు. జీఎంఆర్ సంస్థ అధినేత గ్రంధి మల్లికార్జున రావుతోపాటు వివిధ పారిశ్రామిక దిగజాలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగించారు.

సముద్ర తీర పరిశోధనలకు ఎపి వర్సిటీలతో కలసి పనిచేయండి

ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్, జేమ్స్ కుక్ వర్సిటీ ప్రతినిధులతో లోకేష్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ జిలాయ్ సాకి, జేమ్స్ కుక్ యూనివర్సిటీ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ప్రస్తుతం జేమ్స్ కుక్ యూనివర్సిటీ సింగపూర్ క్యాంపస్ ఆగ్నేసియా, భారతీయ విద్యార్థులకు సేవలందిస్తోంది. ఆంధ్రప్రదేశ్ యువత కోసం పర్యావరణ, ఆరోగ్య సంరక్షణ, సస్టయినబుల్ టూరిజం రంగాల్లో స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 1057 కి.మీ.ల సువిశాల సముద్రతీరం ఉంది. ఫిషింగ్, ఆక్వాకల్చర్, తీరప్రాంత పర్యావరణ వ్యవస్థ నిర్వహణపై మారిటైమ్, తీర ప్రాంత పరిశోధనలకు ఏపి వర్సిటీలతో కలసి పనిచేయాలన్నారు. గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ట్రోపికల్ వ్యాధులు, ఆరోగ్య సంరక్షణ, పాండమిక్ ప్రిపేర్డ్ నెస్ పై ఎపి వర్సిటీలతో కలసి ఉమ్మడి పరిశోధనలు చేపట్టండి. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా టెక్నాలజీ, పాలసీ రిసెర్చికి సహకారం అందించాలని, వ్యవసాయ, పట్టణ నీటి అవసరాలకు జలవనరుల నిర్వహణలో నైపుణ్యం కోసం ఎపితో కలసి ట్రోఫికల్ వాటర్ రిసర్చ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

జూబ్లీ హిల్స్ గెలుపు రేవంత్ రెడ్డి పాలనకు గీటు రాయి

విశాలాంధ్ర - పెందుర్తి: తెలంగాణాలోని జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్ధి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందటం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనాదక్షతకు గీటురాయిగా నిలుస్తుందని ఏపీ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా పేర్కొన్నారు. శుక్రవారం పెందుర్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశించిన దానికంటే ఎక్కువ మెజార్టీ ఇచ్చిన జూబ్లీ హిల్స్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను తెలంగాణ ప్రజలు మనస్ఫూర్తిగా స్వాగతించారని వెల్లడించారు. 2028 ఎన్నికల్లోను కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేసారు. జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్ కు షఫీ అభినందనలు తెలియచేసారు.

వేడుకగా చిల్డ్రన్స్ డే

విశాలాంధ్ర - గాజువాక: భారత తొలి ప్రధాని స్వర్గీయ పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలు 72వ వార్డు చిన గంట్యాడ ఎలిమెంటరీ స్కూల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు చాచా నెహ్రూ జయంతి వేడుకలు దేశ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. చాచా నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, నెహ్రూ పుట్టిన రోజు నవంబర్ 14ను చిల్డ్రన్ డేగా నిర్వహిస్తారని అన్నారు. పిల్లలు రేపటి పౌరులని, వారి అభివృద్ధికి పాలక పక్షాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఫ్రూటీలు, చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏ.లక్ష్మణ్ రావు, దాసరి విజయ సాయి, సిపిఐ నాయకులు జి.ఆనంద్, వార్డు ప్రతినిధులు ఎస్.వి.సుబ్బారావు, బాపయ్య, ఎస్.అప్పల నాయుడు, తుమ్మల నాగేశ్వరరావు, ఎలిమెంటరీ స్కూల్ హెచ్.ఎం శ్రీదేవి, టీచర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

సిడార్ స్కూల్స్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం

విశాలాంధ్ర - తగరపువలస: సిడార్ స్కూల్స్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సిడర్ స్కూల్స్ పాఠశాల డైరెక్టర్ సెరీన్ వివేక కంటి మోహంతి, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ సునీత కౌమన్ పాఠశాల ప్రిన్సిపల్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.పల్లవి విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం పాటలతో నృత్య ప్రదర్శనతో అలరింప చేశారు.

కేంద్రమంత్రి పియుష్ గోయల్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర - పద్మనాభం: విశాఖపట్నంలో నిర్వహిస్తున్న పారిశ్రామిక పెట్టుబడుల సమాఖ్య కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో పద్మనాభం మండల బిజెపి నాయకులు ఘనంగా స్వాగతించారు. కేంద్ర మంత్రిని దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా బిజెపి అధ్యక్షులు పరశురామరాజు, జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తగరపువలస ఒకటి, రెండు వార్డుల మండల బిజెపి మాజీ అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి, పద్మనాభం మండల బిజెపి అధ్యక్షురాలు తమటపు నాగమణి, ఆనందపురం బిజెపి మండల అధ్యక్షురాలు పిల్లా విజయ, మండల పార్టీ సీనియర్ నాయకుడు పిల్లా సూర్యనారాయణ, పద్మనాభం మండల బిజెపి ఉపాధ్యక్షులు మత్స సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిరపురపు వెంకటరావు, ట్రెజరర్ చప్ప నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చాచా నెహ్రూ జయంతి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ట్వింకిల్ విద్యానికేతన్‌లో బాలల దినోత్సవం సందర్భంగా చాచా నెహ్రూ పుట్టినరోజు ఘనంగా జరిపారు. ప్రిన్సిపాల్ బి.శాంతి మాట్లాడుతూ పిల్లలపై అపారమైన ప్రేమ ఉన్నందున ఆయనను అందరూ "చాచా నెహ్రూ" అని ప్రేమగా పిలిచేవారన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఆటలు, నృత్యాలు, పోటీలు వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు లక్ష్మీ, రామలక్ష్మి, కల్పన, లిల్లీ, మనీ, మోహిని, పార్వతి,రేవతి మరియు సంతోషి పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో విశాఖలో రియల్ ఎస్టేట్ అభివృద్ధి

విశాలాంధ్ర - విశాఖ : రానున్న రోజుల్లో విశాఖలో రియల్ ఎస్టేట్ రంగం మరింత అభివృద్ధి చెందనుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ అన్నారు. విశాఖ గాదిరాజు ప్యాలెస్ లో నిర్వహిస్తున్న నరేడ్కో ప్రాపర్టీ షో ను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ సందర్శించారు. వివిధ రియల్ ఎస్టేట్ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ విశాఖపట్నంలో ఉన్న అన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు ఒకే తాటిపైకి వచ్చి ప్రాపర్టీ షో ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీని వల్ల కొనుగోలుదారులు వారి సందేహాలను నివృత్తి చేసుకొని ప్లాట్లు కొనుగోలు చేయడం మరింత సులభతరం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ వల్ల విశాఖలో టీసీఎస్, గూగుల్ వంటి ఐటీ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయని చెప్పారు. దీని వల్ల రియల్ ఎస్టేట్ రంగం మరింత ఊపు అందుకొని ఉత్తరాంధ్ర.. ఉత్తమ ప్రాంతంగా మారుతుం దన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విశాఖను రాష్ట్రంలోనే కాకుండా దేశం, ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు ఈ ప్రాంతమంతా ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కాబట్టి ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు చాలా మంచి నిర్ణయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జీ.సి.సి. చైర్మన్ కె. శ్రావణ్ కుమార్, నరేడ్కో ప్రతినిధులు చక్రధర్, సురేష్, సుబ్బారావు, హుస్సేన్, వెంకన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం శాఖా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి జాతీయ పతకవిష్కరణ చేశారు. భీమునిపట్నం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నిర్మలదేవి రిబ్బన్ కట్ చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఎంపీటీసీ కొట్యాడ రమాదేవి భారత దేశ మొదటి ప్రధాన మంత్రి స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రు జయంతి సందర్భంగా చాచా నెహ్రు చిత్ర పటం ను పూల మాల లతో అలంకరించి నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలన్నారు. యువత గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.వి.ఎస్. అప్పారావు, భీమిలి ఏఎంసీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, ఉప సర్పంచ్ రమణమ్మ, కొట్యాడ లక్ష్మణ మూర్తి, శ్రీనాదు నారాయణరావు, కొట్యాడ రెడ్డి బాబు, గ్రామసచివాలయం సిబ్బంది, ఎం.పి.పి. స్కూల్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానవంతమైన సమాజం

విశాలాంధ్ర - మల్కాపురం: గ్రంథాలయాల వల్ల విజ్ఞానవంతమైన సమాజం ఏర్పడుతుందని, అన్ని సామాజిక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని ములగాడ మండల విద్యాధికారి ఎల్.బి.వెంకట్రావు అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన 58వ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గ్రంథాలయాలను మించిన దేవాలయాలు లేవని అన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా మేధస్సు వికసిస్తుందని అన్నారు. ప్రముఖ పాత్రికేయులు, చిత్రకారులు సుంకర చలపతిరావు మాట్లాడుతూ గ్రంథాలయాలను అంతా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, స్థానిక ఉపాధ్యాయులు పావని, నాగశ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్యామల రావు, ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉధారస్వభావానికి నిలువెత్తు నిదర్శనం పివిజి రాజు

విశాలాంధ్ర - భీమిలి: పూసపాటి విజయరామ గజపతిరాజు విజయనగరం సంస్థానానికి చివరి మహారాజుగా, ఒక పార్లమెంటేరియన్ గా, ప్రజా సేవకుడిగా, దాతగా ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు. పివిజి రాజు 30వ వర్ధంతి సందర్భంగా భీమిలి శాఖ ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాస్టర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గంటా నూకరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. భీమిలి పాత బస్టాండ్ వద్ద ఉన్న పివిజి రాజు నిలువెత్తు విగ్రహానికి గంటా నూకరాజు, కృష్ణారావు మాస్టర్ సంయుక్తంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సేవకు, ధాత్రుత్వానికి ఆదర్శప్రాయంగా విజయనగరం సంస్థానాదీశులు ప్రథమ స్థానంలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి 2
శనివారం 15, నవంబర్ 2025

భారత ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భారత ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ నేటి నుండి విశాఖ వేదికగా జరుగుచున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా విశాఖపట్నం ఐ ఎన్ ఎస్ డేగలో శుక్రవారం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ఉప రాష్ట్రపతికి పుష్పగుచ్ఛాన్ని అందించి ఘన స్వాగతం పలికారు.

2030 నాటికి సెమీకండక్టర్స్ రంగంలో ప్రధాన భాగస్వామిగా ఉంటాం

ఏపీని ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్ హబ్‌గా మార్చడమే మా లక్ష్యం

మంత్రి లోకేష్ సమక్షంలో 17 ఎలక్ట్రానిక్స్ కంపెనీలతో రూ.27,909 కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఎలక్ట్రానిక్స్ సెమీ కండక్టర్స్ రంగాలను ఈనాడు కేవలం కొత్త తరం టెక్నాలజీని మాత్రమే చూడటంలేదని, భారతదేశం గ్లోబల్ హై-టెక్ తయారీ రంగాన్ని మహాశక్తిగా మార్చాలనే ఆశయాన్నీ ప్రతిబింబిస్తుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అభివృద్ధి, అవకాశం, బలోపేతం (ఎలక్ట్రానిక్స్)పై పెట్టుబడిదారుల దృక్పథం అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్‌లోకి ఏపీ కొంచెం ఆలస్యంగా ప్రవేశించిందన్నారు. 2014-19 మధ్య మనకు మొదటి అవకాశం వచ్చింది. తిరుపతి ఎయిర్ పోర్ట్ చుట్టుపక్కల ఏర్పడిన ఎకో సిస్టమ్ వల్ల ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ 1,2 వచ్చాయని, ఇది మన మొదటి ప్రయత్నం అన్నారు.

ఏపీకి ట్రిలియన్ డాలర్ల పెట్టుబడుల సాధనే లక్ష్యం..

మా విధానం కొంచెం భిన్నంగా ఉంటుందని, క్లస్టర్ విధానంలో పారిశ్రామికాభివృద్ధికి కృషిచేస్తున్నామని, వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్ అంటే ఎకోసిస్టమ్‌లోని ప్రతి భాగం, ప్రతి కంపోనెంట్‌ను ఒకే క్లస్టర్‌లోకి తీసుకువస్తామని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. 2030 నాటికి సెమీకండక్టర్స్ రంగంలో ప్రధాన భాగస్వామిగా ఉంటామన్నారు.

17 ఎలక్ట్రానిక్స్ కంపెనీలతో రూ.27,909 కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు

సదస్సులో 17 ఎలక్ట్రానిక్స్ కంపెనీలతో రూ.27,909 కోట్ల మేర పెట్టుబడులకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో జీవోలు, ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది. తద్వారా 53,879 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. తిరుపతిలో ఎస్ సీబీసీ వెంచర్స్ ఎల్ఎల్ పీ(రూ.1,704 కోట్ల పెట్టుబడి, 2,630 మందికి ఉద్యోగాలు), తిరుపతి-శ్యామా ఎస్ జీఎస్ లిమిటెడ్(రూ.1595 కోట్ల పెట్టుబడి, 1894 మందికి ఉద్యోగాలు), తిరుపతి-ఎపిటోమ్ కాంపోనెంట్స్ లిమిటెడ్(రూ.700 కోట్ల పెట్టుబడి, వెయ్యి మందికి ఉద్యోగాలు), తిరుపతి-హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్(రూ.586 కోట్ల పెట్టుబడి, 613 మందికి ఉద్యోగాలు), తిరుపతి- సోలమ్ ఇండియా హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.268 కోట్ల పెట్టుబడి, 700 మందికి ఉద్యోగాలు), తిరుపతి-ఈమక్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.11వేల కోట్ల పెట్టుబడి, 20,500 మందికి ఉద్యోగాలు), తిరుపతి-డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(రూ.2,500 కోట్ల పెట్టుబడి, 2,500 మందికి ఉద్యోగాలు), రాష్ట్రవ్యాప్తంగా ఎస్ పీఎస్ పీఎల్ స్పెషాలిటీ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.2,400 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు), తిరుపతి-ఈ-ప్యాక్ గ్రూప్(1,416 కోట్ల పెట్టుబడి, 5,322 మందికి ఉద్యోగాలు), తిరుపతి-నియోలింక్ డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.1,150 కోట్ల పెట్టుబడి, 2,100 మందికి ఉద్యోగాలు), తిరుపతి- ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(రూ.1,140 కోట్ల పెట్టుబడి, 1,251 మందికి ఉద్యోగాలు), రాష్ట్రవ్యాప్తంగా సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(రూ.1,100 కోట్ల పెట్టుబడి, 2వేల మందికి ఉద్యోగాలు), తిరుపతి-డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్(ఎక్స్ పాన్షన్)(రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి, 10వేల మందికి ఉద్యోగాలు), తిరుపతి-అంబర్ ఎంటర్ ప్రైజెస్ ఇండియా లిమిటెడ్(రూ.400 కోట్ల పెట్టుబడి, 1,500 మందికి ఉద్యోగాలు), తిరుపతి-మీనా సర్క్యూట్స్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.350 కోట్ల పెట్టుబడి, 819 మందికి ఉద్యోగాలు), విశాఖపట్నం-రీఫైబ్స్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్(రూ.350 కోట్ల పెట్టుబడి, 450 మందికి ఉద్యోగాలు), ఎన్టీఆర్ జిల్లా- టైటాన్ ఇంటెక్ లిమిటెడ్ (రూ.250 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు) తో ఎంవోయూ కుదుర్చుకోవడం జరిగింది. ఈ సదస్సులో ఏపీ ఐటి సెక్రటరీ కాటంనేని భాస్కర్, సైర్మా ఎస్ జీఎస్ ఎండి జస్బీర్ ఎస్ గుజ్రాల్, అసిప్ టెక్నాలజీ ఎండి వెంకటసుధాకర్, డిక్సన్ టెక్నాలజీస్ సిఓఓ పంకజ్ శర్మ, నియోలింక్ సిఇఓ రూవెన్ షైబెల్, పిజి ఎలక్ట్రో ప్లాస్ట్ ఎండి వికాస్ గుప్త, హిండాల్కో ఇండస్ట్రీస్ జాయింట్ ప్రెసిడెంట్ దీపక్ దేశ్ ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

దృష్టి లోపం ఉన్నవారికి ఉపయోగపడే స్మార్ట్ గ్లాసెస్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: బెంగళూరుకు చెందిన పందొమ్మిదేళ్ల తుషార్ షా, స్కేలర్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో రెండవ సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థి, ఒక గాడ్జెట్‌ను మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత, ఆవిష్కరణ కలయికను ప్రతిబింబించే పరిష్కారాన్ని అందించాడు. అతని ఆవిష్కరణ, పెర్సీవియా దృష్టి లోపం ఉన్నవారికి సహజమైన గ్లాసెస్ శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025 యొక్క జాతీయ విజేతలలో అతనికి స్థానం సంపాదించింది. శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో సంస్థ యొక్క ప్రధాన విద్యా కార్యక్రమం, ఇది యువ ఆవిష్కర్తలను వాస్తవ ప్రపంచ సమస్యలను గుర్తించి, సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ప్రోత్సహిస్తుంది."ఏఐ ఫర్ ఎ సేఫర్, స్మార్టర్ అండ్ ఇంక్లూజివ్ భారత్", "ఫ్యూచర్ ఆఫ్ హెల్త్, హైజీన్ అండ్ వెల్-బీయింగ్ ఇన్ ఇండియాబీ ఎన్విరాన్మెంటల్ సస్టైనబిలిటీ వయా టెక్నాలజీ" "సోషల్ చేంజ్ త్రూ స్పోర్ట్ అండ్ టెక్ " అనే అంశాలపై కేంద్రీకృతమైంది.

అపోలో హాస్పిటల్స్‌లో 5 వేల కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఇవాళ, భారత, దక్షిణ ఆసియా ఆరోగ్య సంరక్షణ చరిత్రలో మునుపెన్నడూ లేని ఒక గొప్ప విజయాన్ని ఘనంగా జరుపుకుంటోంది. అపోలో కాలేయ మార్పిడి కార్యక్రమం కింద 5,000 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా, భారతదేశంలోప్రత్యేకమైన మైలురాయిని చేరుకున్న మొదటి ఆసుపత్రి గ్రూప్‌గా అపోలో నిలిచిందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఈ అసాధారణమైన ఘనత 25 సంవత్సరాలకు పైగా నిరంతరం సాగించిన క్లినికల్ ఆవిష్కరణలు, దయతో కూడిన సంరక్షణ, 50కి పైగా దేశాల నుండి వచ్చిన, తీవ్రమైన కాలేయ వ్యాధితో బాధపడుతున్న రోగులలో ఆశను నింపాలనే లక్ష్యం దిశగా తొలి అడుగు అని చెప్పుకోవచ్చు అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా కాలంలో, అపోలో కాలేయ మార్పిడి కార్యక్రమం ఏబీఓ-అనుకూలత లేని, సంయుక్త కాలేయ-మూత్ర పిండాల మార్పిడి వంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలను నిర్వహించడంలో ముందుందన్నారు. ఈ కార్యక్రమం వయోజనులకే కాకుండా, కేవలం 4 నెలల వయస్సు మరియు 3.5 కిలోల బరువున్న చిన్న పిల్లలైన శిశువులకు కూడా చికిత్స అందిస్తుంది అని చెప్పారు.

ఏషియన్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఢాకాలో నిర్వహించిన ఏషియన్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2025లో రెండు బంగారు పతకాలు సాధించిన తమ ప్రతిభావంతమైన పూర్వ విద్యార్థిని మరియు అర్జున అవార్డు గ్రహీత వి. జ్యోతి సురేఖ వెన్నంకి కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తోంది. అత్యద్భుతమైన నైపుణ్యం మరియు పోటీ పటిమను ప్రదర్శించిన జ్యోతి, మహిళల వ్యక్తిగత విభాగంలో గోల్డ్ మెడల్‌తో పాటు, మహిళల జట్టు విభాగంలో కూడా స్వర్ణ పతకాన్ని సాధించి, భారత్ సాధించిన నాలుగు పతకాలలో మూడు గోల్డ్ మెడల్స్‌కు కీలక పాత్ర పోషించారు. మహిళల వ్యక్తిగత విభాగంలో జ్యోతి

అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. సెమీఫైనల్లో తైపీ ఆటగాళ్లైన చెన్ సి-యూ పై 149-143 తేడాతో విజయం సాధించిన ఆమె, ఫైనల్లో భారత యువ ప్రతిభ ప్రితికా ప్రదీప్‌పై 147-145 తేడాతో గెలిచి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. అంతకుముందు, ప్రితికా మరియు దీప్శిఖాతో కలిసి జ్యోతి మహిళల జట్టు టైటిల్‌ను భారత్‌కు అందించారు. దక్షిణ కొరియాపై 236-234 తేడాతో గెలిచిన ఈ జట్టు, నాలుగు ఎండ్స్‌లోనూ 59 పాయింట్లతో అద్భుతమైన స్థిరత్వం చూపింది. ఈ విజయాలతో, జ్యోతి తన అంతర్జాతీయ పతకాల సంఖ్య 90కి చేరుకున్నారు. ఇందులో 33 గోల్డ్, 33 సిల్వర్, 24 బ్రాంజ్ పతకాలు ఉన్నాయి. యూనివర్సిటీ ఛాన్సలర్ ఈఆర్. కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ, "మా బి.టెక్ ఎంబీఏ పూర్వ విద్యార్థిని అయిన జ్యోతి సురేఖ వెన్నం గారి విజయాలు మాకు అపార గర్వకారణమన్నారు.

వైసీపీ ఆరో వార్డు అధ్యక్షుడుగా పోతిన ప్రసాద్

విశాలాంధ్ర - కొమ్మాది: భీమిలి నియోజకవర్గం జివిఎంసి ఆరో వార్డు వైసీపీ అధ్యక్షుడుగా అనూష క్యాటరింగ్ అధినేత పోతిన ప్రసాద్‌ను నియమించినట్లు వైసీపీ కేంద్ర కార్యాలయం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల జారీ చేశారు. ఈ సందర్భంగా పోతిన ప్రసాద్ మాట్లాడుతూ వైసిపిలో

ఆరో వార్డు అధ్యక్షుడుగా బాధ్యతలు అప్పజెప్పినందుకు ముందుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డికి, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి చిన్న శ్రీనుకి, ఆయన తనయురాలు సిరమ్మకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పార్టీ గెలుపు కొరకు ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. భీమిలి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా మజ్జి చిన్న శ్రీను రాకతో భీమిలి నియోజకవర్గం వైసీపీ క్యాడర్లో మంచి జోష్ నింపుకుందని ఆయన పేర్కొన్నారు. ఇదే జోష్ తో ఆయనతో కలిసి ముందడుగు వేసేందుకు వార్డు అధ్యక్షులు పదవి తో మరింత ఉత్సాహాన్ని తమలో నింపిందని తెలిపారు. వైసీపీ నాయకులకి కష్టం వచ్చినా తక్షణమే ముందుంటానని పోతిన ప్రసాద్ తెలిపారు.

తాటితూరు జడ్పీహెచ్ హైస్కూల్లో బాలల దినోత్సవం

విశాలాంధ్ర, తగరపువలస: తాటితూరు జడ్పీహెచ్ హైస్కూల్లో బాలల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా స్కూల్లో ఉన్నటువంటి 253 మంది విద్యార్థులతో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలతో అలంకరణ చేసి పిల్లలందరితో పాటల

పోటీలు గేమ్స్ ఆడించి వారికి బహుమతులు, స్వీట్స్ సమోసా అందించారు. అదేవిధంగా ఈ యొక్క బాలల దినోత్సవం కోసం పిల్లలను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు డి శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలందరూ బాగా చదువుకొని ప్రయోజకుల అవ్వాలని వారి తల్లిదండ్రులకు విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని పిల్లలను కోరుతూ నేటి బాలలే రేపటి పౌరులని విషయాన్ని వారికి తెలియజేస్తూ అందరూ బాగా చదువుకొని ఉద్యోగ రంగాలలో అభివృద్ధి బాటలో పయనించి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు భరతమాతకు మంచి పేరు తీసుకురావాలని చదువుతోపాటు క్రీడారంగంలో కూడా మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారిని కోరారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కర్‌రావు చాచా నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన జీవిత విశేషాలు చిన్నారులకు వివరించారు. ఆటలు, పాటలు, విచిత్ర వేషధారణ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ప్రిన్సిపాల్ చేతులు మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లలంతా ఆటలు, పాటలు, డాన్సులతో ప్రాంగణం హోరెత్తించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది శిరీష, శైలజ, హేమ, అన్నపూర్ణ, సునీత పాల్గొన్నారు.

పెందుర్తి: పెందుర్తి శ్రీ చైతన్య పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.తారకేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకి బాలలు అంటే అమితమైన ప్రేమ అని, తన జన్మదినాన్నీ బాలల దినోత్సవంగా జరపాలని ఆయన కోరినట్లు తెలిపారు. బాలల బంగారు భవిష్యత్తుతోనే భారతదేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాలబాలికలు వివిధ రకాలు వేషధారణలతో అలరించారు. విద్యార్థినీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ

ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చైతన్య పాఠశాలల ఉత్తరాంధ్ర పాఠశాలల ఏ.జీ.యం. సురేష్, రీజనల్ ఇన్చార్జ్అహ్మద్ అలీ, అకాడమిక్ డీన్ య.ఆర్.వి.శేషగిరి, సి బ్యాచ్ ఇన్చార్జీ హఫ్సా, ఐకాన్ ఇన్చార్జీ టి.లక్ష్మణ మూర్తి, ప్రైమరీ ఇన్చార్జీ వి.ధనలక్ష్మి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జీ టి.శోభ, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి నౌసేనాబాగ్‌లో కెవి నెం 1 పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుధీర్ కుమార్, మైంగి ఆర్ శ్రీనివాసు, జి ఉమా దేవి పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌తోపాటు ఆటపాటల్లోనూ కూడా విద్యార్థులు రాణించాలన్నారు.

టీడీపీ మూడో వార్డు అధ్యక్షునిగా గొలగాని నరేంద్ర కుమార్

విశాలాంధ్ర - భీమిలి: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ఆదేశాల మేరకు టీడీపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా భీమిలి నియోజకవర్గం జీవీఎంసీ 3వ వార్డు అధ్యక్షుడిగా గొలగాని నరేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శిగా కనకల అప్పలనాయుడు, కోశాధికారి కంచర్ల కామేష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జలగడుగుల మురళి, నొల్లి చిన్న రమణ, రాజగిరి వెంకటరమణ కార్యదర్శులుగా అప్పికొండ నూకరాజు, వియ్యపు పోతురాజు-శీరపు మహేష్ రెడ్డి, యూనిట్ బూత్ ఇన్చార్జిలు ప్రమాణ స్వీకారం భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సమక్షంలో సింహాచలం శ్రీ వరలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం పరిధిలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జీవీఎంసీ 3వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నరేంద్ర కుమార్ మాట్లాడుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, వారి భవిష్యత్తు కార్యాచరణ పార్టీ విధివిధానాలు పట్ల విధేయుడిగా ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు.

నేటి నుంచి ఉచిత యూరాలజీ వైద్య శిబిరం

విశాలాంధ్ర - తగరపువలస: అంతర్జాతీయ పురుషుల ఆరోగ్య అవగాహన మాసం (నవంబర్ నెల) సందర్భంగా నవంబర్ 15 నుంచి 20 వరకు సంగివలస ఎఎన్‌హెచ్‌లో పురుషులకు ఉచిత యురాలజీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎఎన్‌హెచ్ సూపరింటెం డెంట్ ఎస్.ప్రతిమాదేవి తెలిపారు. స్థానిక ఎఎన్ హెచ్ లో ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన యురాలజీ మెడికల్ డైరెక్టర్ చెంచు రెడ్డి మాట్లాడుతూ మూత్రం పోయడం వలన మంట గానీ, అత్యవసర మూత్రం పోయడం, ఎక్కువసార్లు మూత్రం పోయడం, మూత్ర విసర్జనలో వేగం తగ్గడం, ఎక్కువ సార్లు యూరిన్ ఇన్ఫెక్షన్ రావడం తదితర సమస్యలతో బాధపడుతున్న 50 ఏళ్ళు దాటిన పురుషులకు ఈనెల 15 నుంచి 20 తేదీ వరకు ఉచితంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో మహిళలుకు ప్రత్యేకంగా ఇటువంటి ఉచిత శిబిరం ఏర్పాటు చేయనున్నామని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి అభయ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోన్ 1 బీచ్ వద్ద గత 24 సం కాలం నుంచి శ్రీ భీమిలి వీరాంజనేయ అయ్యప్ప స్వామి సంఘం వారు నిత్యం భక్తి శ్రద్ధలతో పూజలు - హోమాలు జరిపిస్తున్నారు. కార్తీక మాసం సంతరించుకుంటే చాలు నేటికి 24 సం నుంచి ప్రతీ ఏటా పలు మాలా దారుణ భక్తులకు ప్రజలకు 41 రోజులు ఉచిత అన్నదాన కార్యక్రమం దాతలు సహాయ సహకారాలు తో ఏర్పాటు చేస్తారు. అందులో బాగంగా ఈ సంవత్సరం భక్తి తో పాటు అన్నదాన కార్యక్రమం సాంప్రదాయ బద్ధంగా ఉండాలనే ఆలోచనతో సంఘ సభ్యులు అరటాకులుపై పలు రకాల పసైందైన రుచులతో కూడిన పదార్థాలను భక్తులకు వడ్డించి పెట్టారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భీమిలి జోన్ నుంచి మాత్రమే కాకుండా భీమిలి ఆనందపురం పద్మనాభం మండలాలలో ఉన్న పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అదిక సంఖ్య పాల్గొని స్వామి వారి మెండైన ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి మెకర నర్సింగ్‌రావు, అధ్యక్షులు కె.ఎర్రి నాయుడు, ఉపాధ్యక్షులు కదిరి జగన్నాదం, ప్రధాన కార్యదర్శి మెకర నర్సింగ్ రావు, కోశాధికారి పిల్లి శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీ కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ జాతీయ వారోత్సవాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. 75వ వార్డు కార్పొరేటర్ పులి ఝాన్సీ ముఖ్య అతిథిగా విచ్చేసారు. అధ్యక్షత వహించిన అద్దంకి రాఘవాచార్యులు సాహితీ సుధా వ్యవస్థాపకులు మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన సముపార్జన చేసుకోవాలన్నారు. పులి ఝాన్సీ మాట్లాడుతూ పెదగంట్యాడ గ్రంథాలయము ఎందరో నిరుద్యోగులకు పోటీ పరీక్షలు ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నడుపూరు ప్రధానోపాధ్యాయులు రాచకొండ శ్రీనివాసరావు, పులి వెంకట రమణారెడ్డి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి వెంకటరమణ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

అనధికార దత్తతలు ప్రోత్సహించొద్దు

చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం బాలల దినోత్సవ కార్యక్రమంలో వక్తలు

విశాలాంధ్ర - వన్‌టౌన్: అనధికార దత్తతలను ఎట్టి పరిస్థితుల్లోను ప్రోత్సహించొద్దని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం సారధ్యాన శుక్రవారం బాలల దినోత్సవాన్ని పునస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. అధికారిక దత్తతలనుప్రోత్సహిద్దామని, అనధికార దత్తతలను నివారించేందుకు అవగాహన కల్పిద్దామని పేరిట చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రూపొందించిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం కింగ్ జార్జి ఆసుపత్రి పర్యవేక్షణధికారి కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొందు సీతారాం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యదేవిల చేతులు మీదుగా ఆవిష్క రించారు. అనంతరం డాక్టర్ వాణి,డాక్టర్ కే.వి.ఎస్.ఎం.సంధ్యా దేవి మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కారా మార్గదర్శకాలను అనుసరించి మాత్రమే అధికారిక దత్తత పొందడం సులభతరమని అన్నారు.

చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొందు సీతారాం మాట్లాడుతూ బాలల హక్కులు, వారి పరిరక్షణలో భాగంగా వివిధ చట్టాలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై తమ ఫోరం తరపున ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అడుగులు వేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.చంద్ర శేఖర్ నాయుడు, ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ బి.బంగారయ్య, ఆయుర్జీవ సంస్థ ఫౌండర్ ఎస్.సుబ్బలక్ష్మి, చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం ప్రతినిధులు కె.ఎల్లయ్య, సనపల ఢిల్లీ, ప్రవీణ త్రినాథ్, ఎం.హరీష్, బి.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాగృతి యాత్రతో భాగస్వామ్యం చేసుకున్న హెచ్‌డిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశం యొక్క వ్యవస్థాపక స్ఫూర్తిని స్ఫూర్తిదాయక వేడుకగా చేసుకుంటూ, 18వ ఎడిషన్ జాగృతి యాత్ర నవంబర్ 13, 2025న విశాఖపట్నం చేరుకుంది. భారతదేశం విదేశాల నుండి జాగ్రత్తగా ఎంపిక చేయబడిన 500 మంది యాత్రికులను ఏకం చేసే 8,000 కిలోమీటర్ల జాతీయ ప్రయాణంతో చేసే, 15 రోజుల యాత్ర కార్యక్రమం మరో మైలురాయిగా నిలిచింది. దాదాపు 68,000కంటే ఎక్కువ మంది దరఖాస్తుదారుల నుండి ఎంపిక చేయబడిన ఈ పార్టిసిపెంట్స్, ఎంటర్‌ప్రైజ్ ఆధారిత అభివృద్ధి ద్వారా ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించాలనే జాగృతి యొక్క లక్ష్యం ను ప్రతిధ్వనిస్తారు. ఇది వ్యాపార, విద్య మరియు ఆర్థిక అవగాహన ద్వారా భారతదేశ యువతకు సాధికారత కల్పించే భాగస్వామ్య లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుందని హెచ్‌డిఎఫ్‌సి అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ ఎండి నవనీత్ మునోత్ తెలిపారు.

ఎన్‌ఎస్ఇలో 24 కోట్ల మైలురాయిని దాటిన పెట్టుబడిదారుల ఖాతాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా మరో మైలురాయిని చేరుకుంది. నవంబర్ 2025 నాటికి ప్రత్యేకమైన ట్రేడింగ్ ఖాతాల సంఖ్య24 కోట్లు (240 మిలియన్లు) దాటింది. ఇది, గత ఏడాది అక్టోబర్‌లో 20 కోట్ల (200 మిలియన్లు)మార్క్‌ను అధిగమించిన తర్వాత కేవలం ఒక సంవత్సరంలో సాధించిన మైలురాయి. ప్రత్యేకంగా రిజిస్టర్డ్పెట్టుబడిదారుల సంఖ్య 12.2 కోట్లకు (అక్టోబర్ 31,2025 నాటికి) చేరింది, సెప్టెంబర్22, 2025 నాటికి 12 కోట్ల (120 మిలియన్లు) ప్రత్యేక రిజిస్టర్డ్ పెట్టుబడిదారుల మైలురాయిని అధిగమించింది. పెట్టుబడిదారులు వేర్వేరు బ్రోకర్లవద్ద ఖాతాలను కలిగి ఉండవచ్చు, ఇది ఒకే వ్యక్తికి బహుళ క్లయింట్ కోడ్‌లకు దారితీస్తుంది.మహారాష్ట్ర 4 కోట్లకు పైగా ఖాతాలతో (17% వాటా) అగ్రస్థానంలో ఉంది, దీని తరువాత ఉత్తరప్రదేశ్ (2.7 కోట్లు, 11%), గుజరాత్ (2.1 కోట్లు, 9%), పశ్చిమ బెంగాల్ (1.4 కోట్లు,6%) మరియు రాజస్థాన్ (1.4 కోట్లు, 6%) ఉన్నాయి. ముఖ్యంగా, మొదటి ఐదు రాష్ట్రాలు మొత్తంపెట్టుబడిదారుల ఖాతాలలో సుమారు 49% వాటాను కలిగి ఉండగా, మొదటి 10 రాష్ట్రాలు 73% పైగావాటాను కలిగి ఉన్నాయని శ్రీ శ్రీరామ్ కృష్ణన్,చీఫ్ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ అన్నారు.

శివపార్వతుల కళ్యాణం కరపత్రాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నెల్లిముక్కు రామాలయం ప్రాంగణంలో గల శ్రీ శ్రీ గోవింద మాంబా సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కాశీ విశ్వేశ్వర స్వామి వారి కార్తీక మహోత్సవాలు సందర్భంగా శివపార్వతుల కళ్యాణం బహుళ ఏకాదశి వైభవంగా జరగనుంది. పూజారి అరుణ్ కుమార్ శర్మ, కొత్త లంక భువన శర్మ ఆధ్వర్యంలో కళ్యాణం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకటరమణారెడ్డి విచ్చేసి మాట్లాడుతూ ఈ కార్తీకమాసంలో ప్రజలందరూ శివుని తాలూకా ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదుర్తి శ్రీరామ్ మూర్తి, ద్వారపూడి గురునాథరావు, పూడి హరీష్, వై.శివప్రసాద్, కొమ్మోజి, కిషోర్ స్వామి, పుట్ట కృష్ణ, గోర్స సురేష్, ముద్దు మణికంత, దొమ్మేటి సోమ నాయుడు, కోరుబిల్ల అప్పారావు, పెట్ట మనోహర్ రెడ్డి, కనీతి అప్పలరాజు పాల్గొన్నారు.

విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి 3
శనివారం 15, నవంబర్ 2025

ఎస్ఎఇఎల్ చైర్మన్ సుఖ్ భీర్ ఆవ్లాతో మంత్రి లోకేష్ భేటీ

డాటా సెంటర్లపై పెట్టుబడులు పెట్టాల్సిందిగా విజ్ఞప్తి..

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఎస్ఎఇఎల్ చైర్మన్ సుఖ్ భీర్ ఆవ్లాతో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... చంద్రబాబు గారి నేతృత్వంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుతోంది. ఇప్పటికే రాయలసీమలో రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టిన డాటా సెంటర్ హబ్ గా మారుతున్న విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుఖ్ భీర్ ఆవ్లా మాట్లాడుతూ... రెన్యువబుల్ ఎనర్జీ, మౌలిక సదుపాయాలు, వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఎస్ఎఇఎల్ సంస్థ 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేసింది. వ్యవసాయ, మున్సిపల్ వ్యర్థాల ఆధారిత విద్యుత్ ప్లాంట్లను నిర్మించింది. ఎస్ఎఇల్ హైవేలు, ఇండస్ట్రియల్ పార్కులు, సస్టయినబుల్ హౌసింగ్ ప్రాజెక్టులను చేపట్టిందని అన్నారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై ప్రతిపాదనలపై సుఖ్ భీర్ ఆవ్లా సానుకూలంగా స్పందించారు.

రాష్ట్రానికి జాతరలా పెట్టుబడులు

దూరం కానున్న నిరుద్యోగ సమస్య

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ : విశాఖలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న సిఐఐ సదస్సులో జాతరలా వస్తున్న పెట్టుబడులతో భవిష్యత్తులో నిరుద్యోగ సమస్య దూరం కానుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఐఐ భాగస్వామ్య సదస్సుతో ప్రపంచమంతా విశాఖ వైపు చూస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికీ లేనంత పొడవైన సముద్ర తీరప్రాంతం మన రాష్ట్రానికి ఉందని, అలానే పరిశ్రమలు స్థాపనకు తగిన వనరులు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకునేందుకు భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా శ్రమించి పెట్టుబడులు తెస్తున్నారన్నారు. సిఐఐ భాగస్వామ్య సదస్సుకి దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తరలి రావడమే దీనికి నిదర్శనమన్నారు. ఈ రెండు రోజుల సదస్సులో మొత్తం 410 ఒప్పందాలతో సుమారు రూ.10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయన్నారు. తద్వారా పెద్ద ఎత్తున యువతకి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. సదస్సుకి ముందు రోజు విశాఖలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ 5 రంగాల్లో 35 సంస్థలతో రూ. 3.65 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకి ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. పలు సాఫ్ట్ వేర్ సంస్థలకు, కార్పోరేట్ కంపెనీల కోసం శంకుస్థాపన కూడా చేశారన్నారు. పెట్టుబడిదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలకులు రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపులతో అనేక సంస్థలను తరిమికొట్టారని, దీంతో రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే పెట్టుబడులకు సానుకూల వాతావరణం సృష్టించారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లు దేశ, విదేశాల్లో పర్యటించి, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే పారిశ్రామిక ప్రోత్సాహకాలు, రాయితీలు వివరిస్తూ, రాష్ట్రంలో ఉన్న వనరులు గురించి వివరిస్తూ పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగిస్తున్నారన్నారు. విటన్నింటి ఫలితంగా పెట్టుబడిదారులు రాష్ట్రానికి తరలివస్తున్నారన్నారు. వీటన్నింటిని గమనిస్తున్న పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారన్నారు. భవిష్యత్తులో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావటానికి ఆస్కారం ఉందని ఆశాభావం వ్యక్తం చేసారు.

బాబాసాహెబ్ ఆదర్శాలను పూర్తిస్థాయిలో సాకారం చేయాలి

-ఘనంగా ప్రారంభమైన అంబేద్కర్ చైర్ల జాతీయ సదస్సు

విశాలాంధ్ర - విశాఖపట్నం: బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదర్శాలను 21 శతాబ్దంలో పూర్తిస్థాయిలో సాకారం చేయాలని కేంద్ర సామాజిక న్యాయం - సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఏయూలోని ఐఐఎం-వి క్యాంపస్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ చైర్ల ను ఒకే వేదికపైకి తీసుకువచ్చి నిర్వహిస్తున్న మొట్టమొదటి జాతీయ సదస్సుకు ఆయన వర్చువల్ విధానంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అంబేద్కర్ ఫౌండేషన్ సహకారంతో ఏయూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్, ఐఐఎం-విలోని అంబేద్కర్ చైర్ సౌజన్యంతో "డాక్టర్ అంబేద్కర్ మరియు భారత రాజ్యాంగం: న్యాయం, సమానత్వం మరియు సమగ్ర అభివృద్ధి" అంశంపై సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కేవలం సంక్షేమానికి పరిమితం కాదని, సాధికారత, విద్య, లింగ భాగస్వామ్యం, అవకాశాలలో సమానత్వం కలిగి ఉంటుందన్నారు. సదస్సులో భాగంగా డాక్టర్ అంబేద్కర్ చైర్ ల జాతీయ ఆన్‌లైన్ పోర్టల్‌ను అమిత్ యాదవ్ ఈ సందర్భంగా ప్రారంభించారు. ఇది జ్ఞానం, డేటా నిధిగా ఉపయోగపడు తుందన్నారు. అంబేద్కర్ చైర్స్ నేషనల్ ఆన్లైన్ పోర్టల్ ను ఆంధ్ర యూనివర్సిటీ డాక్టర్ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ డెవలప్ చేసారని, తక్కువ సమయంలో దీనిని తీర్చిదిద్దిన ఆచార్య జేమ్స్ స్టీఫెన్‌ను అభినందించారు. విడిఎం- ఇండియా ఆన్ ద మూవ్(ఎన్‌జిఓ) చైర్మన్ అజిత్ ఆచార్య మాట్లాడుతూ ఆధునిక భారతావని నిర్మాణం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిర్మించిన బలమైన రాజ్యాంగ పునాదులపైనే జరుగుతోందని అన్నారు. అంబేద్కర్ చైర్ మెంబర్ సెక్రటరీ వి.అప్పారావు మాట్లాడుతూ జ్ఞానము, విధానాలు కలసి సాగినపుడే సామాజిక మార్పు సాకారం అవుతుందన్నారు. అంబేద్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ మనోజ్ తివారీ మాట్లాడుతూ ఇటువంటి మేధో సదస్సులు ప్రతీ సంవత్సరం నిర్వహించాలన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ మేధో సమ్మేళనంగా రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో ఇటువంటి జాతీయ సదస్సుకు వేదికగా నిలవడం ఎంతో ప్రతిష్టాత్మకమన్నారు. కార్యక్రమంలో ఐఐఎం-వి సంచాలకులు ఆచార్య చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు.

మాలతాంబ విద్యానికేతన్ పాఠశాలలో బాలల దినోత్సవం

విశాలాంధ్ర - పీఎం పాలెం: భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా..కార్ షెడ్ కూడలి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం చెరువులో గల మాలతాంబ విద్యానికేతన్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ?ఈసందర్భంగా పాఠశాల ఆవరణమంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ విద్యావేత్త, ఎన్.ఐ.ఎఫ్.ఎస్.విద్యాసంస్థల అధినేత సునీల్ మహంతి హాజరై విద్యార్థిని విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తు అని నెహ్రూ కలలు కన్నారని,వారి కలలను సాకారం చేసే బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు.విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతలు, నైతిక విలువలను కూడా అలవర్చుకోవాలని అన్నారు.కేవలం మార్కులు, ర్యాంకుల కోసం కాకుండా, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే విధంగా తమను తాము సమర్థులుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేకంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు.చిన్నారులు ఉత్సాహంగా నృత్యాలు, పాటలు, నాటికలు ప్రదర్శించి అందరినీ అలరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి, వైస్-ప్రిన్సిపాల్ సిహెచ్.అనురాధ, పాఠశాల అధ్యాపక బృందం,విద్యార్థులు,వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోద్రెజ్ అగ్రోవెట్ రూ.70 కోట్ల పెట్టుబడి కోసం రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ

విశాలాంధ్ర- విశాఖ సిటీ: భారతదేశంలోని అతిపెద్ద డైవర్సిఫైడ్ అగ్రి-ఫుడ్ బిజినెస్‌లలో ఒకటైన గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (గోద్రెజ్ అగ్రోవెట్) ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం (ఏ పీ)తో నాన్-బైండింగ్ మెమోరాండం ఆఫ్ అండర్స్టాండింగ్ (ఎం ఓ యు) పై సంతకం చేసింది. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం, కంపెనీ తన డెయిరీ వ్యాపారంలో డెయిరీ ప్రాసెసింగ్ మరియు విలువ ఆధారిత ఉత్పత్తుల సామర్థ్యాలను విస్తరించడానికి రూ. 70 కోట్ల పెట్టుబడి పెడుతుంది మరియు ఆయిల్ పామ్ రైతుల కోసం వన్-స్టాప్ సొల్యూషన్ సెంటర్ కొత్త సమాధాన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఎమ్ఒయు సంతకం చేయబడింది. గోద్రెజ్ అగ్రోవెట్ ఎండి సునీల్ కటారియా, గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ కార్పొరేట్ వ్యవహారాల గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి ఈ సందర్భంగా వ్యాఖ్యానిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, సీఎం నారా చంద్రబాబు నాయుడు "మన నేలలోని రైతులు ప్రతిపాదించడానికి వ్యవసాయ ఆహార ప్రాసెసింగ్ రంగాన్ని బలోపేతం చేయడం అత్యవసరందానితో సమకాలీకరించబడి, బలమైన మరియు విశ్వసనీయ భాగస్వామి అయిన గోద్రెజ్ ఆగ్రోవెట్‌తో భాగస్వామి అయినందుకు మేము సంతోషిస్తున్నామన్నారు. ఈ భాగస్వామ్యం మన వ్యవసాయ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే సమయంలో సమాజానికి స్థిరమైన జీవనోపాధిని కూడా సృష్టిస్తుందని నేను విశ్వసిస్తున్నా అన్నారు. వ్యాపారాలకు మద్దతునిచ్చే మరియు కమ్యూనిటీలను ఉద్ధరించే పర్యావరణ వ్యవస్థను పెంపొందించినందుకు మేము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. "రైతులను శక్తివంతం చేయడంలో మా అగ్రి ఫుడ్ ప్రాసెసింగ్ సామర్థ్యాలను బలోపేతం చేయాలనే మా ఉద్దేశ్యానికి నేటి ఎమ్ఒయు నిదర్శనం అని, ఫుడ్ ప్రాసెసింగ్‌లో బలమైన ఆవిష్కరణల వారసత్వంతో, మా లక్ష్యం భారతదేశ పోషకాహార ప్రకృతి దృశ్యాన్ని అభివృద్ధి చేయడం మరియు వ్యవసాయ-ఆర్థిక వృద్ధికి దోహదం చేయడం అని చెప్పారు.

98వ వార్డులో మోడ్రన్ లైటింగ్‌ను ప్రారంభించిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో ప్రతి వీధిలైటు వెలిగేలా చర్యలు చేపట్టడం జరిగిందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన భీమిలి నియోజకవర్గం 8వ జోన్ 98 వ వార్డు లోని పాత గోశాల జంక్షన్ నుండి అడివివరం జంక్షన్ వరకు ఏర్పాటు చేసిన ఆధునిక విద్యుత్ దీపాలను భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ పీ.వీ. నరసింహం లతో కలిసి ప్రారంభించారు . ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నిరంతరం విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి విశాఖను అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. విశాఖ వేదికగా 14, 15 తేదీల్లో జరుగుచున్న సిఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా అనేక పెట్టుబడుల ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జివిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించిన నగరంపాలెం యువకుడు అనిల్ కుమార్

విశాలాంధ్ర - పీయం పాలెం : మధురవాడ జీవీఎంసీ జోన్ 2 పరిధి 5 వ వార్డు నగరం పాలెం గ్రామానికి చెందిన ఇల్లిపిల్లి అనిల్ కుమార్ కు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ ఇంజనీర్ విభాగంలో డాక్టరేట్ లభించింది. ఈ విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ ఎం గోపీచంద్ నాయక్ పర్యవేక్షణలో మల్టీ ఆబ్జెక్టివ్ అప్రోచ్ ఫర్ ఆప్టిమల్ ఎలకేషన్ ఆఫ్ డి జి ఇన్ రేడియల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ అనే అంశంపై అనిల్ కుమార్ పరిశోధన చేశారు. ఈయన ఏపీ ఆర్ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. ఈ డాక్టరేట్ ను ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి పి రాజశేఖర్ చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో అందుకున్నారు .ఈ సందర్భంగా ఆయనను మధురవాడ పరిసర గ్రామాల ప్రజలు మరియు నగరంపాలెం గ్రామస్తులు అభినందించారు.

బీహార్ ఎన్నికల విజయం పట్ల హర్షం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం భీమిలి నియోజకవర్గం బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించిన సందర్భంగా బిహార్ ప్రజలకు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసింది. విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్ మీడియా తో మాట్లాతూ బీహార్ ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని ఇది బీహార్ ప్రజల విజయం అని హర్షం వ్యక్తం చేశారు 243 సీట్లకుగాను రెండు విడతల్లో జరిగిన ఎన్నికలలో అఖండ విజయం సాధించింది దేశాభివృద్ధి ప్రజల సంక్షేమం రెండు కళ్లుగా పాలనచేస్తూ అగ్రరాజ్యాలకు పోటీపడుతూ 4 వ స్దానంలో భారత్ ను నరేంద్ర మోదీ పాలన వల్లేనని సాధ్య పడిందని కొనియాడారు,2024 లోకసభ ఎన్నికల్లో మొదలు హర్యానా, మహారాష్ట్ర,ఢిల్లీలను కైవాసం చేసుకుని మోదీ హవా ప్రత్యేకమని ఇప్పుడు బీహార్ ఈ ఎన్నికలు రుజువు చేసాయని 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ 20 సంవత్సరాలుగా ప్రతీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో శాశ్వత ప్రజాదారణ పొంది ఆయన చేసిన అభివృద్ధి రెండు దశాబ్దలాగ అధికారంలోకి రావడానికి కారణ మైందని బీహార్ రాజకీయాల్లో ఒక బలమైన శక్తి గా మార్చిందని తెలిపారు.

రెండు మిస్సింగ్ కేసులను ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ నగరంలో ద్వారకా మరియు ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన రెండు మిస్సింగ్ కేసులలో వారి ఆచూకీ కనుగొని, వారి వారి కుటుంబసభ్యులకు నగర పోలీసులు సురక్షితంగా అప్పగించారు. ఈ మిస్సింగ్ కేసులను సమర్థవంతంగా చేదించిన పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

అవంతి కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర, తగరపువలస: తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కార్యక్రమాన్ని అవంతి సెంట్రల్ లైబ్రరీలో కళాశాల ప్రిన్సిపాల్ బి. మురళీకృష్ణ గ్రంథాలయ పితామహుడైన డాక్టర్ సియాలి రామామ్రత రంగనాథన్ కి పూలమాలవేసి నివాళులర్పించి లైబ్రరీ యొక్క గొప్పతనం గురించి వివరించారు. అవంతి కళాశాల లైబ్రరీలో సుమారు 43 వేలు పుస్తకములు అందుబాటులో వున్నాయని అధునాతన సౌకర్యాలు కలిగిన డిజిటల్ లైబ్రరీ, ఇంటర్నేషనల్ మరియు నేషనల్ జర్నల్స్, మ్యాగ్జిన్స్ మరియు రీసెర్చ్ డాకుమెంట్స్ అందుబాటులో ఉంచామని విద్యార్థులందరూ వీటిని ఉపయోగించుకోవాలని హితవు పలికారు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా పుస్తక పఠనం యొక్క ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గిపోదని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం మరియు జిజ్ఞాస కలుగుతుందని అవంతి విద్యాసంస్థలు చైర్మన్ మాజీ మంత్రివర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు , డైరెక్టర్ ఎ. చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు.